

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**నవకల్పనా నవరూప్ సే రచనా రచనా రచీ జబ్ నార్ కీ**

**సత్యం శివం సుందరం సే శోభా బఢీ సంసార్ కీ.**

'మృగతృష్ణ' అన్న సినిమా గురించి చాలా తక్కువమందికి తెలుసు. వారికి కూడా రఫీ ఎంతో భావాత్మకంగా పాడిన ఈ పరమాద్భుతమైన పాట ఉన్న సినిమాగా మాత్రమే తెలుసు. భారతీయ చలన చిత్రాలలో 'మృగతృష్ణ'లాంటి సినిమా రాలేదని చెప్పవచ్చు. 1857 ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామం నేపథ్యంలో సామాన్యుల జీవితాలలో చెలరేగిన సంఘర్షణలు, మానసిక దౌర్బల్యాలు, వైకల్యాలను, భ్రమలను అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శిస్తుందీ సినిమా. పరిస్థితులలో కొట్టుకుపోయేవారు కొందరయితే, ఆ పరిస్థితులను తమకనువుగా వాడుకోవాలనేవారు కొందరు. ఎవరెలా ప్రయత్నించినా అందరినీ ముంచెత్తే విధి ఆడే ఆటల వంటి అనేకానేక విషయాలను ప్రస్తావిస్తూ సాగుతుంది 'మృగతృష్ణ' సినిమా. మిథ్యకూ నిజానికీ నడుమ ప్రదర్శితమయ్యే లోతైన భావాన్ని ప్రదర్శిస్తుందీ సినిమా.

ఓ వైపు చారిత్రాత్మకమూ, మరోవైపు సామాజికమూ, మానసికమూ అయిన ఈ సినిమా సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ సరిహద్దులలో సంచరిస్తుంది. ఈ సినిమాలోని ఓ నేపథ్యంలో వచ్చే గీతం ఇది. ఈ గీతానికి హేమామాలిని నృత్యం చేస్తుంది. ఇప్పటి భాషలో చెప్పాలంటే ఈ పాట 'ఐటమ్ సాంగ్'లాంటిది. కానీ మొత్తం సినిమా అర్థాన్ని, తత్వాన్ని, మాయ, సత్యాల నడుమ కొట్టుమిట్టాడే ప్రపంచ రీతిని అత్యద్భుతంగా వివరిస్తుందీ పాట.

ప్రధానంగా మహమ్మద్ రఫీ గానం ఆధారంగా ఇంకా సజీవంగా ఉన్న ఈ పాటను రచించిందీ, సంగీత దర్శకత్వం వహించిందీ శంభుసేన్. శంభు సేన్ తండ్రి 'జమాల్ సేన్' కూడా సినీ సంగీత దర్శకుడు. పెద్దగా విజయం సాధించలేదు.

'దయేరా' సినిమాలో రఫీ యుగళ గీతం 'దేవతా తుమ్ హో మేరా సహారా' పాటవల్ల జమాల్ సేన్ అనేకులకు గుర్తుంటాడు. అతడి కొడుకు శంభుసేన్ కూడా మహమ్మద్ రఫీ పాట 'నవకల్పనా నవ రూప్ సే' పాట ద్వారా గుర్తుండిపోతాడు.

'నవకల్పనా' పాట విలక్షణమైన, విభిన్నమైన పాట. ఈ పాట 'మాయ' స్వరూపాన్ని 'స్త్రీ' శక్తిని నిగూఢంగా, మార్మికంగ ప్రదర్శిస్తుంది. ఈ పాటకు ప్రేరణ 'మాయ' గురించి కబీర్ చెప్పిన దోహాలు.

**మాయా మహాఠగినీ హం జానీ**

**నిరగున్ షాంస్ లియే కర్ డోలై, బోలై మధురీ బాణీ**

'మాయ' అన్నది మహా మోసకారి. నిర్గుణుడయిన వాడిని తన మోహపాశంలో బంధిస్తూ ఆనందంగా నృత్యం చేస్తుంది. మాయను పెంచే తీయని మాటలు చెప్తుంది.

**కేసవ కె కమలా హ్వై బైఠీ, సివ కే భవన బవానీ**

**పండా కే వనారత్ హ్వై బైఠీ, తీరథ మే భయీ పానీ..**

కేశవుడు అంటే విష్ణువుతో సహచరి కమలలా పక్కనే ఉంటుంది. శివుడి ప్రేయసి భవానీలా శివుడి సరసన ఉంటుంది. పండితులు పూజించే విగ్రహాలు మాయ. తీర్థాలలో ప్రవహించే పవిత్రజలం మాయ.

ఈ పాటకు ఈ ప్రపంచాన్ని కప్పి ఉంచే 'మాయ' కేంద్ర బిందువు. ఈ మాయను తొలగించి చూస్తే విశ్వం అసలు స్వరూపం బోధ పడుతుంది. విశ్వంని కప్పి ఉంచి సత్యదర్శనానికి ప్రతిబంధకంగా నిలుస్తుంది మాయ. ఆ మాయకు ప్రతీక స్త్రీ.

భారతీయ పౌరాణిక గాథలలో మాయా మోహంలో ముంచెత్తే అందమైన స్త్రీల ప్రసక్తి తరచు కనిపిస్తుంది. తపస్సు చేస్తున్న వారి దృష్టి మళ్లించి, తపోభంగం కలిగించి వారిని మాయలో కట్టిపడేసేందుకు అప్సరసలున్నారు. ఊర్వశి, మేనక, రంభలు అందరికీ తెలుసు. యక్షిణిలున్నారు ప్రలోభ పెట్టి పతనం చేసేందుకు. అందమైన స్త్రీ మూర్తులు భారతీయ శిల్ప కళలో అత్యంత ప్రధాన పాత్ర వహిస్తాయి. కాళిదాసు, భాసుడు, శూద్రకుడుతో సహా ఆధునిక కాలంలో కూడా అనేక కవులు సుందరమైన స్త్రీ కల్పనను, స్త్రీ, సౌందర్య వర్ణనను పద్యాలలో, గద్యాలలో పొందుపరచారు. స్త్రీ సౌందర్య శృంగార

రసప్రవాన్ని పొంగి పోర్లించారు. రాజా రవి వర్మ తన చిత్రాలలో స్త్రీ సౌందర్యానికి సమ్మోహన శక్తికి నీరాజనాలర్పించాడు. వాత్సాయనుడు కామ సూత్రాలద్వారా, శిల్పులు 'ఖజురహో' లో శిల్పాల ద్వారా, స్త్రీ  రతి అవతారాన్ని విలక్షణమైన కల్పనలతో శృంగార రసావిష్కణకు అస్తిత్వాన్ని కల్పించారు. భౌతిక సుఖ లాలసకు, ఆధ్యాత్మికతకూ ఉన్న సంబంధాన్ని శిలలపై శిల్పాల ద్వారా చెరగని రీతిలో ప్రతిష్టించారు.

నృత్యం, సాహిత్యం శృంగార రసప్లావితాలు. సౌందర్యం ఓ వైపు తీవ్రమైన శృంగార భావన కలిగిస్తే, మరోవైపు తీవ్రమైన ఆధ్యాత్మిక భావనను రగిలిస్తుంది. 'విశాలనేత్రాలు కథ' శృంగార భావం ఆధ్యాత్మిక అన్వేషణగా రుపాంతరం చెందటానికి చక్కని ఉదాహరణ.

ఈ శృంగార సౌందర్యంలో నిబిడీకృతమై ఉన్న ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ప్రదర్శించే హిందీ సినీ గీతం 'నవకల్పనా నవరూప్  సే రచనా రచీ  జబ్ నార్ కీ'

గీత రచయిత, సంగీత దర్శకుడు ఈ పాటను శుద్ధ హిందీ భాషలో రచించాడు. యమన్ రాగంలో సమ్మోహకరమైన బాణీని సృజించాడు. పూర్తిగా సాంప్రదాయిక వాద్యాలను వాడాడు. అలౌకికము, దైవ సృష్టికి ప్రతీక అయిన స్త్రీ సౌందర్యానికి హిందీ సినీ గీతాలు అర్పించిన అత్యుత్తమ నీరాజనం లాంటిది ఈ పాట.

**అంగ్ ప్రతి అంగ్ శుభాంగ్ సుహావే**

**నైన్ అధర్ కటి నృత్య దిఖావే**

ఆమె ప్రతి అంగం శుభాంగంగా వర్ధిల్లుతోంది. నయనాలు, అధరాలు, కటి నాట్యం చేస్తున్నాయి.

పై పాదాలకు సామాన్యార్ధం ఇది. పాట రచన సందర్భాన్ని, సినిమా పాట అంతరార్ధాన్నీ, అవసరాన్నీ  గుర్తించి విశ్లేషిస్తే ఈ పదాలకు మరో అర్ధం, ఆధ్యాత్మిక అర్ధం వస్తుంది.

'అంగం,' అన్నది సృష్టిస్తేనే ప్రకటితమయ్యేది. ఈ సృష్టిలో సృష్టించిన ప్రతీదీ సుందరమూ, మోహకరమూ అవుతుంది. ఆమె కళ్ళు, పెదిమలు, నిర్గుణుడయిన వాడిని బంధించిన సంతోషంలో నృత్యం చేస్తున్నాయి. సమ్మోహనకరమైన స్త్రీ వదనం, శరీర లావణ్యాన్ని మోహించని వారెవరు?

నృత్యం ప్రధానంగా భావ, రస, తాళ భరితం. నృత్యం దైవార్చనకు మరో రూపం. అదే నృత్యం భౌతిక వాంఛ ప్రేరేపణకు ఒక సాధనం. ఈ పాట ఆరంభంలో స్త్రీ స్వరూపాన్ని సమ్మోహకరంగానూ, మనిషిని సంసార బంధనాలవైపు ఆకర్షించి, నిర్గుణుడిని, నిర్మోహినీ సగుణిడిగా మోహబద్ధుడిని చేయగల శక్తిని ప్రదర్శిస్తున్నది. ఇప్పుడు పాట పల్లవి ఆరంభమవుతుంది.

ఒక నూతన సృష్టి స్త్రీ. ఒక నూతన రూపం స్త్రీ. ప్రకృతిని సర్వం తనలో ఇముడ్చుకుని భగవంతుడి సృష్టి సమస్తం తనలో పొందుపరచుకుని ప్రదర్శించే ప్రకృతి ఆకృతి స్త్రీ. ఎప్పుడయితే ఆమె సృష్టి సంభవించిందో ఆపుడే సత్యం, శివం, సుందరంలతో సంసార శోభ ఇనుమడించింది. ఇది మామూలు అర్ధం.

ఈ నూతన కల్పనతో, నవరూపాన్ని రచించిందెవరు? నిర్గుణుడు, నిరాకారుడు. నిర్గుణుడు, నిరాకారుడయిన వాడి కల్పనతో, మాయ నవరూపం ధరించింది. సత్యాన్ని కప్పి ఉంచటం 'మాయ' పని. అందుకని మాయ అత్యంత సుందరంగా, సమ్మోహనకరంగా ఉంటుంది. అంటే, ఈ ప్రపంచంలో మాయ నిత్యనూతన రూపాలలో దర్శిస్తూ తన మాయతో ప్రపంచాన్ని కప్పి ఉంచుతూంటుంది. అంటే, మాయ కూడా భగవంతుడి సృష్టే. కానీ, భగవంతుడు మాయకు అతీతం.

రెండవ పాదం మొదటి పాదం అర్ధాన్ని మార్చేస్తుంది. సత్యం, శివం, సుందరంలతో సంసార శోభను ఇనుమడించిందీ మాయ.

**ఈశ్వర్ సత్య హై**

**సత్య హీ శివ హై**

**శివ హీ సుందర్ హై..**

'సత్యం శివం సుందరం' సినిమాలో పండిత్ నరేంద్ర శర్మ రాసిన అతి గొప్ప పాట ఇలా ఆరంభమవుతుంది. ప్రపంచానికి సత్య దర్శనం కాకుండా కప్పి ఉంచే మాయ, ఈశ్వరుడికి ప్రతీక అయి సంసార శోభను ఇనుమడింపచేస్తున్నది. జీవితానికి ఒక అర్ధాన్ని, గమ్యాన్ని కల్పిస్తున్న స్త్రీ సౌందర్యం భౌతికం. ఆ మోహంలో పడినవాడు దారి తప్పి పోతాడు. సంసార అనుభవాలలో కూరుకుపోతాడు. ఆ పిపాస తీరేది కాదు. యయాతి తన సంతానం

యవ్వనాన్ని కూడా తీసుకుని అనుభవించి అర్థం చేసుకున్న సత్యం అది. ఇది అద్భుతమైన మాయ. సత్యాన్ని దర్శించకుండా అడ్డుపడే మాయనే సత్య దర్శనానికి కారణం అవుతుంది.

**కళాకి దాసీ కామినీ**

**సోలాహ కళా పరిపూర్ణ్ హై**

**విశ్వ మే విషకన్యా కే**

**యే నాం సే ప్రసిద్ధ్ హై**

**హావ భావ అనుభావ్ సే**

**సేవా కరే భగవాన్ కీ..**

ఒక్కొక్క పదం అర్ధ గర్భితం. ఈ పాటను రచించిన గేయ రచయతకు సహస్ర కోటి ప్రణామాలు అర్పించాలనిపిస్తుంది. ఆమె 'కళాకిదాసి' కళలకు దాసి. 'కళల దాసి ' అంటే సామాన్యార్ధం కళల ప్రేమికురాలు అని. కానీ కళల దేవత సరస్వతి. అంటే స్త్రీ, సరస్వతికి దాసి. పదహారు కళలంటారు. తరువాత పాదం పదహారు కళలు ఆమెలో పరిపూర్ణంగా ఉన్నాయి అంటుంది. దయ, ధైర్యం, క్షమ, న్యాయం, నిరపేక్షత, తపస్యత, దానశీలత, అపరిచిత్త (అజేయం).. ఇవి ఆధ్యాత్మిక విలువల కళలు. గీత, విద్య, వాద్య విద్య, నృత్య విద్య, నాట్య విద్య, ఆలేఖ్య విద్య (చిత్రకళ) విశేషకచ్ఛేయ విద్య (రంగుల చిత్రాలు), మణి భూమిక కర్మ (నగల తయారీ), సుగంధ విద్య, దశనవ సనాంగరాగ (పళ్లు, దుస్తులు, శరీరానికి రంగులు వేసే కళ) ఇవన్నీ పదహారు కళలు. ఈ కళలు ఆమెలో పరిపూర్ణంగా ఉన్నాయంటాడు కవి.

అయితే భారతీయ సంప్రదాయం ప్రకారం 16 కళలకు 16 కళాస్థానాలు ఉన్నాయి. అవి, తల, ఎదురు రొమ్ము, చేతులు, కుచములు, తొడలు, నాభి, నుదురు, కడుపు, పిరుదులు, వీపు, చంకలు, మర్మ స్థానము, మోకాళ్లు, పిక్కలు, పాదములు, బొటన వ్రేళ్లు. అంటే ఆమె శరీరం సర్వం కళామయం. 'అంగం అంగం శుభాంగం' అనటం ఇప్పుడు మాములు మాట కాదని అర్ధమవుతుంది. పదహారు కళలు ఆమెలో పరిపూర్ణంగా ఉన్నాయంటే, పదహారు కళల స్థానాలయిన శరీరం అంగాలు కూడా పరిపూర్ణంగా ఉన్నాయని అర్ధం.

ఇంత పరిపూర్ణమై, మనోరంజకం, మనోహరమూ అయిన రూపం ధరించిన ఆమె ప్రతివారినీ వివశులను చేయటంలో ఆశ్చర్యం లేదు. ఆమెను చూసి మైమరచి పోవటం సర్వ సాధారణం. మైమరచి పోవటం అంటే సంసార లాలసలో పడటం. గమ్యం మరచి దారి తప్పటం. అందుకని ప్రపంచంలో ఆమె 'విషకన్య'లా ప్రసిద్ధి పొందింది. పలు నాగరికతలలో స్త్రీ, పురుషుడిని తప్పు దారి పట్టిస్తుందని ఆమె ఎవ్వరికీ కనబడకూడదు అని ఆంక్షలు విధించడం, శరీర లావణ్యం కనబడని రీతిలో దుస్తులు వేసుకోవాలని నియమాలు విధించటం కనిపిస్తుంది. భారతీయ ధర్మం ఇందుకు భిన్నం.

భారతీయ ధర్మం స్త్రీ, సౌందర్యాన్ని, భగవంతుడి కళానైపుణ్య ప్రదర్శనగా అర్థం చేసుకుంది. ఆ సౌందర్యానికి నీరాజనాలు అర్పించింది. ప్రతి అంగంనుంచి  జాలువారే అమృత రస ప్రవాహాన్ని ఆనందంగా అనుభవించాలని చెప్పింది. ఈ ఆనందానుభవాలకు పరిమితం కాకుండా, వాటి వెనుక దాగిన విధాత నైపుణ్యాన్ని అర్థం చేసుకోమని చెప్పింది. ఎదురుగా కనబడే స్త్రీ సౌందర్యంలో నిబిడీకృతమై ఉన్న అనంతమైన  సౌందర్యాన్ని దర్శిస్తూ, ఆ సౌందర్యంలో ఒదిగి ఉన్న పరమాత్మ పరమ వైభవ కేళీ విలాసాన్ని అర్థం చేసుకోమని చెప్పింది. ఎదురుగా కనిపిస్తున్న సౌందర్యానికి ఆవల పొంచి ఉన్న నిరాకార నిర్గుణ స్వరూపుడిని గ్రహించటమే జీవిత పరమావధి అని నిరూపించింది.

సామాన్యులు సౌందర్య సముద్రంలో మునిగిపోతారు. యోగులు, సాధువులు, ముక్షువులు  ఈ సముద్రాన్ని దాటి ఆవలకు వెళ్తారు. అయితే స్త్రీకి ఇదంతా పట్టదు. ఆమె కేవలం పలు భావాలకు ఉత్ప్రేరకం మాత్రమే. రసాయన చర్యలను వేగవంతం చేస్తుంది తప్ప తాను రసాయన చర్యలలో  పాల్గొనదు.  ఆమె హావభావాల అనుభవ అనుభూతులన్నీ భగవంతుడికి అర్చన. అంటే, స్త్రీని సరిగా అర్థం చేసుకుంటే భగవంతుడిని చేరే దారి చూపుతుందన్నమాట. లేకపోతే సంసార మాయాకూపంలో ఇరుక్కుపోయి కొట్టుమిట్టడతాడు.  ఇది భారతీయ తత్వంలో స్త్రీ ప్రాధాన్యం.

స్త్రీ పురుషుడిలో భాగం కాదు. ఆమె ప్రత్యేకం. కల్పన, నవ సృష్టి ఆమె. పురుషుడికి సంపూర్ణంగా భిన్నం. ఆమె ప్రతి అంగం నుంచి భగవంతుడు తొంగి చూస్తూంటాడు. భగవంతుడిని దర్శించలేనివాడు భౌతికానికి పరిమితమవుతాడు. దర్శించగలిగినవాడు ముక్తిని పొందుతాడు. ఇందులో స్త్రీ  చేసేదేమీ లేదు. ఆమె సృష్టి సత్యం శివం సుందరం. దానికి ప్రతిస్పదించేది పురుషుడు. భగవంతుడిని దర్శించలేని అశక్తతను, వైఫల్యాన్ని అంగీకరించని పురుషుడు, ఆమెను 'విషకన్య' అని దోషం ఆమెపై వేస్తాడు. ఎవరేమన్నా ఆమె ప్రతి కదలిక భగవంతుడికి అర్చన. అలాంటి స్త్రీ, సైతం 'మాయ' ప్రభావంలో పడి, తన శక్తిని, ప్రత్యేకతను విస్మరించి, పురుషుడిలా ఉండాలని, పురుషుడితో సమానమవటమే పరమావధి,

అదే అభివృద్ధి అని భావించటం, అలా అవ్వాలని ప్రయత్నించటం 'మాయ' లో పడిన మాయ ప్రవర్తనను ప్రదర్శిస్తుంది. రక్తినో, ముక్తినో ఇవ్వాల్సిన స్త్రీని పురుషుడే ప్రలోభంలో పెడుతున్నాడన్నమాట.

**చంద్రమాసే ముఖ్ సలోనా**

**శ్యామ వర్ణ్ కేశినీ**

**నయనోంసే మృగనయనీ హై**

**వాణీ మధుర్ ఉచ్చారతీ**

**నృత్య గాన త్రిగధాన పూజా**

**ఇన్ కా ధర్మ్ హై ఆరతీ**

పాట ముందు పాదాలలో ప్రకృతితో స్త్రీ సౌందర్యాన్ని పోల్చాడు. చక్కటి ప్రతీకలు. ముఖం చందమామలా అందమైనది. కేశాలు శ్యామల వర్ణం. కళ్లు మృగనయనీ, లేడి వంటి కళ్లు. మాట మధురంగా ఉచ్చరిస్తుంది. చివరి రెండు పాదాలలో పాట అర్థాన్ని మార్చేశాడు. ఈ సౌందర్యంతో ఆమె నిత్యం నృత్యం, గానంతో భగవంతుడిని అర్చిస్తూంటుంది.

ఒకప్పుడు దేవదాసి వ్యవస్థ ఉండేది సమాజంలో. ఆ దేవదాసి నిత్యం భగవంతుడిని అర్చిస్తూనే ఉండేది. ఆమె జీవితం భగవంతుడికి అంకితం. అత్యంత అద్భుతమైన పవిత్రమైన భగవద్దత్తమైన జీవితం ఆమెది. కానీ కాలం అన్నిటినీ రూపాంతరం చెందిస్తుంది. 'దేవదాసి' వ్యవస్థ దిగజారి, భగవంతుడి సేవాభావన అదృశ్యమైపోయింది. ఈ పాట శుభ్రమైన, పవిత్రమైన దేవదాసి వ్యవస్థను వర్ణిస్తుంది. తద్వారా ప్రకృతికి ప్రతీక అయిన భగవంతుడి అత్యుత్తమ సృష్టి, కళా ప్రతిభకు నిదర్శనం అయిన స్త్రీని వర్ణిస్తున్నది. స్త్రీ నిత్యం భగవత్ అర్చనలో ఉంటుంది. ఆమె మాట, పాట నృత్యం సర్వం భగవత్ దర్శనానికే. తెలిసినా, తెలియకున్నా స్త్రీ శరీరంలో అణువణువు భగవదర్చనకోసమే. అది ఆమె ధర్మం. ఆమె సర్వం భగవంతుడికి ఆరతి. నీరాజనం.

**దేవలోక్ కి దేవదాసీ**

**సుందర్ రూప్ లుభావనీ**

**పైంజన్, కంచుకీ, కర్ధానీ**

**సోలా శృంగార్ సుహావనీ**

**శంఖ, దమరు, ఝూంఝు, ఝూమర్**

**నూపుర్ ధ్వని మన్‌మోహినీ...**

సకల వాయిద్యాలు ఆమె అలంకారాలు. ఆమె దేవలోకంలో దేవదాసి. సుందర రూపం ఆమెది. శరీరాలంకారాలు , మానసికానందం కలిగించే వాయిద్యాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంది ఈ పాట. కాళ్లకు గజ్జెలు, శరీరం చుట్టే వస్త్రము, చేతులకి అలంకారాలు వంటి పదహారు రీతుల అలంకారాలు ధరించిందామె. 'సోలాహ శృంగార్' అంటే పెళ్లి వస్త్రాలు, జుట్టు ముడి వేసుకునే పద్ధతులు, బొట్టు, సింధూరం, పాపిట అలంకారం, కాటుక, కర్ణాభరణాలు, నాసిక ఆభరణాలు, మెడ ఆభరణాలు గొలుసులు, గోరింటాకు అలంకారాలు, గాజులు, చేతులకు అలంకారాలు, వ్రేళ్లకు ఆభరణాలు (అంగుళి భూషణాలు), గజ్జెలు, కాళ్ల వ్రేళ్ల భూషణాలు వంటి అలంకారాలన్నీ చేసుకున్న అమ్మాయి సోలాహ సింగారాలతో ఉన్న అమ్మాయి. అలాంటి సుందరి ఆ స్త్రీ, ఆమె తన రూపంతో అందరినీ అలరిస్తుంది. ఆకర్షిస్తుంది. ప్రలోభపెడుతుంది.

శంఖం, దమరు, తాళం ఆమె నూపురధ్వనిలో మిళితమై మన్మోహనంగా ఉన్నాయి. ఆమె అలంకారాలన్నీ భౌతికం. వాయిద్యాలు మానసికం. ఆమె అలంకారాలు ప్రలోభపెడతాయి. మానసిక సంగీతం మనస్సును హరిస్తుంది. వీటన్నిటితో ఆమె నృత్యం చేస్తూంటే అలౌకికానందం కలుగుతుంది. ఎవరయితే అలౌకికానందాన్ని అనుభవిస్తారో, వారు భౌతిక పరిధి దాటి సత్యదర్శనం చేయగలుగుతారు.

ఈ చివరి చరణంలో రెండు విధాల భావాలను అతి చక్కగా ప్రదర్శించాడు కవి. ఆమె అలంకారాలన్నీ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసేవే. సౌందర్యం భౌతికం. అలంకారాలన్నీ శరీరానికి. కానీ 'శబ్దం' మనసు గ్రహిస్తుంది. అది భౌతికం కాదు. అధిభౌతికం. సృష్టికి ఆరంభం 'ఓం కారం'. ఓంకారం ప్రతిధ్వనులే సప్తస్వరాల ఆధారిత సంగీతం. ఆ సంగీతం శంఖం, దమరు, తాళం ద్వారా ఆధ్యాత్మకతను ప్రదర్శిస్తుంది. అంటే భౌతిక ఆకర్షణ, ఆధ్యాత్మికత పథంలో అడుగు అన్నమాట. స్త్రీ, సౌందర్యంలోని రెండు పార్శ్వాలు చూపించాడు కవి. ఆమె నృత్యం భగవదార్చన. కాబట్టి అలంకారం మాత్రమే చూసేవాడు అక్కడే ఆగిపోతాడు. నృత్యంలో భగవదార్చన దర్శింపచేసే వాయిద్యాల లయను అనుభవించినవాడు ఒక మెట్టు ఎదుగుతాడు.

ఈ ఫాటను మహమ్మద్ రఫీ అతి ప్రత్యేకంగా పాడతాడు. ఒక్కో పదాన్ని దాని భావం మనసుకు స్ఫురించేలా పలుకుతాడు. అతి అద్భుతమైన గాన పద్ధతి ఇది. ఈ పాటకు నృత్యం చేసేందుకు హేమ మాలినిని ఎన్నుకోవటంతో సగం విజయం సాధించినట్టయింది. స్వయంగా శాస్త్రీయ నృత్య కళాకారిణి కావటంతో హావభావ అభినయాలు అద్భుతంగా ఉండే పాటలో పదాలు ప్రదర్శించే భావాలను ఆమె నృత్యం ద్వారా ఉద్దీపితం చేస్తుంది. ఉత్తమ కళ భగవతార్చన అన్న భావాన్ని కలిగిస్తుంది. భౌతిక సౌందర్యం ఆధ్యాత్మికపుటన్వేషణకు ప్రేరణనిస్తుందన్న భావన కలిగిస్తుంది.

ఈ ఒక్క పాటతో 'శంభుసేన్' అమరుడయ్యాడు. సినిమా ఆ కాలంలో ప్రజాదరణ పొందకున్నా ఈ పాట ఈ నాటికీ సజీవంగా నిలుస్తోంది. గేయ రచయిత, సంగీత దర్శకుడితోపాటు సినిమా పేరునూ సజీవంగా నిలుపుతోంది. ఉత్తమ కళా సృజన భగవదార్చనలో భాగం అని నిరూపిస్తూ కళాకారుల ముందు ఉత్తమ ఆదర్శం నిలుపుతోంది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story